నేడు గోషామహల్, నాంపల్లిల్లో మంత్రి కేటీఆర్ రోడ్ షో

అబిడ్స్, నవంబర్ 17 : ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శనివారం గోషామహల్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ తరపున ప్రచారం చేయనున్నారు. నియోజకవర్గంలోని మంగళ్‌హాట్ నుంచి రోడ్‌షో ప్రారంభించి బేగంబజార్ ఛత్రి చౌరస్తాకు చేరుకుంటారు. చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, బేగంబజార్ మార్కెట్, సిద్దంబర్ బజార్ మీదుగా గౌలిగూడ చమాన్‌కు చేరుకుంటారు.

రోడ్ షో కు ఏర్పాట్లు పూర్తి..

మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గోషామహల్ నియోజకవర్గం రోడ్ షో సందర్భంగా అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర ట్రేడ్ సెల్ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపించాలని మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తారన్నారు.

మల్లేపల్లిలో మంత్రి కేటీఆర్ రోడ్ షో నేడు

మెహిదీపట్నం నవంబర్ 17 : మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నాంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో పాల్గొంటారని ఎమ్మెల్యే అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు. మల్లేపల్లి చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి యువ నాయకులు, మంత్రి కేటీఆర్ మాట్లాడతారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్ షోను విజయవంతం చేయాలని ఆనంద్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని బేగంబజార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థి టి.రాజాసింగ్ ప్రచారాన్ని చేపట్టారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు, యువ నాయకులు మూల విక్రంగౌడ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు గోవింద్ రాఠితో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు లడ్డు యాదవ్, వి.గణేశ్ యాదవ్, దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 17**

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీత పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. లక్ష్మీనగర్, అంబేద్కర్‌నగర్, మహాలక్ష్మి నగర్, శివలాల్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధిని విస్మరించిన బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో గౌ కరణ్ సింగ్ పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 17**

పాత నేరస్తుడి అరెస్ట్

మెహిదీపట్నం, నవంబర్ 17 : కత్తితో సంచరిస్తున్న పాతనేరస్తుడి శుక్రవారం లంగర్‌హౌస్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హాశంనగర్‌లో నివసించే హాశం పాత నేరస్తుడిగా ఉన్నాడు. శుక్రవారం అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకుని విచారణ చేపట్టారు. తనిఖీలు చేయగా కత్తి దొరికింది. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా కోర్టు 15 రోజుల జైలుశిక్ష వేసిందని ఏసీపీ తెలిపారు.

ప్రజల సహకారంతో విజయం సాధిస్తా

మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్

జాంబాగ్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్, ధన్‌రాజ్

అబిడ్స్, నవంబర్ 17 : ప్రజల సహకారంతో విజయం సాధించి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ అన్నారు. శుక్రవారం చుడిబజార్, బేదర్‌వాడి, జగన్నాథ్, మట్టు, బేగంబజార్ ఛత్రి ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బేగంబజార్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పూజా వ్యాస్ బిలాల్, బీఆర్ఎస్ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, ప్రియా గుప్తా, క్రాంతి కుమార్, పి. నరేందర్ యాదవ్, ముఖేశ్ ముదిరాజ్, సునిల్ సాహు, పప్పు మాత్రే, వనిత, సంతోషి, రాజు యాదవ్, ప్రదీప్‌రాజ్ పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ ప్రజలను కోరారు. ఆగాపుర ప్రాంతంలో ఇంటింటికి తిరిగి వ్యాస్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ గెలిపిస్తే నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి పాటు పడడంతో పాటు వాడవాడలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

సీఎం కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ అన్నారు. జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్‌తో కలిసి ఆయన బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఆశిష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అభివృద్ధి నిలిచి పోయిందని నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ధన్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్, నవంబర్ 17 : 2023 అసెంబ్లీ ఎన్నికలలో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎ స్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సరస్వతి దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం గన్‌ఫౌండ్రీ డివిజన్ పరిధిలోని సుల్తాన్‌బజార్‌లో సరస్వతి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అనిత, నాగమణి, కల్యా ణి, సంగీత, ఉమారాణి, భారతి, నిఖత్ బేగం, కీర్తన పాల్గొన్నారు.

ఆగాపురలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్

ప్రచారంలో పాల్గొన్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సరస్వతి

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

సుల్తాన్‌బజార్,నవంబర్ 17 : టీఎన్జీవో ప్రభుత్వ సిటీ కళాశాల యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. శుక్రవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా శాఖ ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా నేనావత్ రాంకుమార్,కార్యదర్శిగా విమల్ కిశోర్ మిశ్రా ఎన్నికైనట్లు వారు వివరించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేనీ కార్యవర్గానికి నియామకపత్రాలను అందజేశారు. యూనిట్ నూతన కార్య వర్గం ముజీబ్‌హుస్సేనీ,కేంద్ర సంఘం నాయకులు చంద్రశేఖర్,అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర,సభ్యులు బొలిగిద్ద శంకర్,ఖాలేద్ అహ్మద్‌లను శాలువాలతో సన్మానించారు. ముజీబ్‌హు స్సేనీ మాట్లాడుతూ.. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదవ స్పోర్ట్స్, గేమ్స్‌లో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

న్యాయవాదులు ప్రముఖ పాత్ర పోషించాలి

జిల్లా జడ్జి ప్రేమావతి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమావతి

నాంపల్లి కోర్టులు, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు ప్రముఖ పాత్ర పోషించాలని నాంపల్లి కోర్టుల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి ప్రేమావతి అన్నారు. నాంపల్లి కోర్టుల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ పర్యవేక్షణలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో న్యాయవాదులే బాధ్యత వహించి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. పోలీసు అధికారులు లోక్‌అదాలత్ నిర్వహణకు అందుబాటులో ఉండకపోవడం పట్ల నాంపల్లి కోర్టు న్యాయసేవాధికార సంస్థకు న్యాయవాదులు చేయూతనందించాలన్నారు. సికింద్రాబాద్, మనోరంజన్ కాంప్లెక్స్, కల్పతరుతో పాటు నాంపల్లి కోర్టులన్నింటిలోనూ అధిక కేసుల పరిష్కారానికి కక్షిదారులకు సహకారాన్ని అందించాలన్నారు. ఇరువర్గాల వారికి నోటీసులు సైతం జారీ చేసేందుకు తోడ్పాటునందించాలన్నారు. 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జి రమాకాంత్‌రావు మాట్లాడుతూ.. రాజీ చేసుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదికని తెలిపారు.

ప్రశంసలు అందుకున్న శ్రీకృష్ణ రాయభార పద్యనాటక ఘట్టం

పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు, పాల్గొన్న పద్య నాటకంలో నటించిన గుమ్మడి గోపాలకృష్ణ బృందం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 17 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎ.ఆర్.కృష్ణ జయంతి కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఆర్.కృష్ణ చిత్రపటానికి నాటకప్రియులు చెన్నూరి ఆంజనేయరెడ్డి, డాక్టర్ డి.ఎస్.ఎన్. మూర్తి, ఎమ్. సంజీవి, జి. నెహ్రూ, డాక్టర్ గౌరీపతి శాస్త్రీ, ఎ.పి. నీలం పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాటక దర్శకులు గుమ్మడి గోపాలకృష్ణ తన బృందంతో కలిసి శ్రీకృష్ణ రాయభార ఘట్టంలోని పలు సన్నివేశాలను ప్రదర్శించి పద్యాలను ఆలపిస్తూ నాటకాన్ని మరింతగా రక్తికట్టించి నాటక ప్రియుల కరతాళధ్వనులందుకున్నారు. సామాజిక ఇతివృత్తాలపై రచించిన ఆధునిక తెలుగు సాంఘిక పద్యనాటక రచనా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు.